సిలికానాంధ్ర

# సుజనరంజని



# వృక్షో రక్షతి

**- ప్రతాప వెంకట సుబ్బా రావు**

పొద్దున్నే పేపర్ చేతుల్లోకి తీసుకున్న నేను ఒక ప్రకటనకి ఆకర్షితుడనయ్యాను.

**శ్రద్ధాంజలి**

**గత సంవత్సరం మా కాలనీలో మా స్వార్థానికి 153 చెట్లు అసువులు బాసాయి. వాటి ఆత్మకి శాంతి కలగాలని కాలనీ కమ్యూనిటీ హాలులో ఈ ఆదివారం ఒక కార్యక్రమం ఏర్పాటు చేశాము. వృక్ష ప్రేమికులందరూ వచ్చి భాగం పంచుకుంటారని ఆశిస్తున్నాము.** – వాసవి కాలనీ వాసులు

ఆదివారం.

మా ఆవిడ పెట్టిన ఉప్మా పెసరట్టు లాగించి.. చిక్కటి కాఫీ తాగి.. తాపీగా మాకు రెండు కిలోమీటర్ల దూరంలో వుండే ఆ కాలనీకి బయలుదేరాను.

నేను కమ్యూనిటీ హాలుకి చేరుకునేసరికే ఓ వందమంది దాకా వచ్చి వున్నారు. నన్ను సాదరంగా ఆహ్వానించి హాల్ లోపలికి తీసుకెళ్ళి కుర్చీలో కూర్చోబెట్టారు. నేను గమనించిందేమిటంటే, అన్నిచోట్లా థర్మాకోల్ పై చెట్ల బొమ్మలు వేసి వాటికింద చక్కటి కొటేషన్లు రాసారు. అంతేకాకుండా హాల్ చుట్టుపక్కలా, హాల్లోనూ పూల కుండీలను చక్కగా అలంకరించారు. నిర్వాహకులు వాళ్ళ కుటుంబ సభ్యులూ ఆకుపచ్చటి దుస్తులు ధరించారు. విచ్చేసిన అందరికీ పచ్చదనపు విలువను చాటిచెప్పే బ్యాడ్జీని దానిక్రింద భాగానికో నల్లటి గుడ్డ ముక్కనీ తగిలించారు. మైకుల్లోంచి మంద్రంగా విషాద సంగీతం వినిపిస్తోంది.

అరగంటలో కార్యక్రమం వృక్ష ప్రార్థనతో ప్రారంభమైంది.

అధ్యక్షుడి ప్రారంభోపన్యాసం:

“ఆహుతులకి సాదర ఆహ్వానం. ‘వృక్షో రక్షతి రక్షితః’ ఇది అందరికీ తెలిసిందే. వృక్షాలు మనకి ప్రాణవాయువు నిచ్చి కాపాడుతున్న మూగ జీవాలు. మనిషి జీవితం మామిడాకుల శుభంతో మొదలై.కట్టెలలో కాల్చే అశుభంతో ముగుస్తుంది. చెట్టు యొక్క ప్రాధాన్యత అంతా ఇంతా కాదు. సకుటుంబ వనభోజనాలకి వేదికవుతుంది. భోజన వడ్డనకి అరిటాకవుతుంది..నీళ్ళు తాగడానికి దోనె అవుతుంది. విసన కర్రవుతుంది..ఆఛ్ఛాదనకి అంగ వస్త్రమవుతుంది. మనకే కాదు సమస్త జంతు జాలానికీ ఎండ నుండి వర్షం నుండి కాపాడే గొడుగవుతుంది.. ఆకలితీరుస్తుంది. ఇలా జీవ మనుగడకి అడుగడుగునా తోడుంటుంది. ఇది మీకందరికీ తెలియదని కాదు. మరోసారి పునశ్చరణ అంతే.

చెట్టు విలువ తెలిసీ దాన్ని పట్టించుకోకపోవడం మనకే చెల్లింది. అలా మా నిర్లక్ష్యానికి గత సంవత్సరం 153 చెట్లు బలయ్యాయి. ఇది చెప్పింది ఏ మేధావో.. పర్యావరణ పరిరక్షణ సభ్యుడో కాదు.. ఓ ఏడేళ్ళ అబ్బాయి. వాడు ఎక్కడ చెట్టు నరుకుతున్నా అడ్డుకున్నాడు.. తన నోట్ పుస్తకంలో రాసుకున్నాడు. నేను ఒకసారి రోడ్డు విస్తరణ కోసం చెట్లు నరుకుతుంటే.. వాడి తాపత్రయం చూశాను. సిగ్గేసింది. అప్పుడే మనసు ఈ కార్యక్రమానికి నాంది పలికింది.

దయచేసి మీ అందరికీ ఓ విజ్ఞప్తి. చెట్లని ప్రాణులుగా చూడండి. అప్పుడే వాటికి అపకారం తలపెట్ట బుద్ధి కాదు. ఒకవేళ అవి నేల రాలినా వాటికి మనుషుల్లాగే శ్రాద్ధకర్మలు చేయండి అలా అన్నా వాటి ఆత్మకి శాంతి చేకూర్చుదాం.

ఇప్పుడందరూ లేచి నిలబడి మరణించిన చెట్ల ఆత్మ శాంతికై రెండు క్షణాలు మౌన ప్రార్థన చేయండి. అని లేచి నిలబడ్డాడు. మేమందరం భారమైన మనసులతో లేచి నిలుచుని కళ్ళు మూసుకున్నాం. కళ్ళముందు నేలకు రాలుతున్న చెట్ల ఆక్రందనలు.. వాటి పక్కన మనుషుల వికటాట్టహాసం మనోచక్షువులకి విన్పించసాగాయి. గుండె బరువెక్కింది. 'వృక్షవిలాపం' ప్రభోదాత్మక నాటకం, పద్యాలు, కవితలు, పాటలు అన్నీ అందరి మనసుల్నీ గెలుచుకున్నాయి. కార్యక్రమం ఉద్దేశం నెరవేరినట్టే అనిపించింది.

మనకోసం మన స్వార్థం కోసం ఎన్నో కార్యక్రమాలు చేసుకుంటాం.. కాని ఇలాంటి నిస్వార్థ సేవా కార్యక్రమాలు ఎంతో అవసరమనిపించింది. ఇంటికెళ్ళి మిగిలిన ఆదివారాన్ని సినిమాలకి.. షికార్లకి కాకుండా మా పెరటిలోని చెట్ల మధ్య వాటికి సేవ చేస్తూ గడపాలని నిశ్చయించుకున్నాను.

లేచి బయట కొస్తుంటే రెండు మొక్కలు చేతిలో పెట్టారు. గాలికి ఊగుతూ నా చేతిని అవి స్పర్శిస్తుంటే ఏదో అనిర్వచనీయ ఆత్మీయ అనుభూతి కలిగింది.

.ఇప్పుడవి నేను దత్తత తీసుకున్న నా పిల్లలు..

★★★